క్లుప్తంగా

మారెమ్మకు బోనాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ముద్దనూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లె గ్రామంలో సోమవారం గ్రామస్తులు మారెమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గత రెండు రోజుల పాటు గ్రామంలో దేవర కార్యక్రమం నిర్వహించిన అనంతరం డప్పు వాయిద్యాలతో తల మీద బోనాలు పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు బోనాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

మైలవరం : మండల పరిధిలోనిని గొల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి పుల్లన్న కుమారుడు నాగేశ్వరరావు మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సోమవారం ఉదయం గొల్లిపల్లి గ్రామానికి వెళ్లారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం



ఆహార పొట్లాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

లింగాల : లింగాలలోని దీనబంధు ఆశ్రమం, ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో సోమవారం పులివెందుల ఆలియాన్స్ ఫర్ పాస్టర్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పాస్టర్ డేవిడ్ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలియాన్స్ ఫర్ పాస్టర్స్ డెవలప్‌మెంట్ అధ్యక్షులు ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ కిరణ్, సెక్రటరీ దేవరాజ్, ట్రెజరర్ కృపరాజ్, మెంబర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ముంతాజ్ బేగం

కొండాపురం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ముంతాజ్‌బేగం పేర్కొన్నారు. సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని మండలంలోని యర్రగుడి, చామలూరు, కొత్తపల్లి, టి.కోడూరు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకు కూరలతోపాటు పప్పు దినుసులు బాగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, ఎం, పద్మావతి, ఆదిలక్ష్మి, సింధు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి




మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఓ, సిబ్బంది

వేముల : పంటలు సాగు చేసే రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి సూచించారు. మండలంలోని వి.కొత్తపల్లె రైతు సేవా కేంద్ర పరిధిలో మట్టి నమూనాలను సేకరించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 సీజన్‌కు సంబంధించి మండల వ్యాప్తంగా 528 మట్టి నమూనాలను సేకరించాలని ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్దేశించారని, ఒక్కో రైతు సేవా కేంద్ర పరిధిలో 60 మట్టి నమూనాలను సేకరిస్తున్నామన్నారు. రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి భాస్వరం, నత్రజని, పొటాష్ వంటి పోషకాల లభ్యత, ఉదాజని సూచిక, లవణ సాంద్రత, సేంద్రీయ కర్బనం వంటి పోషకాలు ఎంత పరిమాణంలో ఉన్నాయన్న విషయాలను భూసార పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సంతోష్, వీఆర్‌ఏ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

గ్రాసం కొరత.. రైతన్న వెత

- కనిపించని పచ్చగడ్డి
- ఎండుగడ్డి ధర అధికం
- భారంగా పశుపోషణ
- కబేళాకు తరలిస్తున్న వైనం



పశువుల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్ గడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా పశుగ్రాసం కొరతతో మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ వరిగడ్డి కొనుగోలు చేయాలంటే రూ.15 వేల నుంచి రూ.20 వేలు పలుకుతోంది. దీంతో పశుపోషణ భారంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ గడ్డి రూ.10 వేలతో కొనుగోలు చేస్తున్నప్పటికీ.. పశుగ్రాసం కొరత ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి 50 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల పొలాల్లో బీడుగా మారిపోతున్నాయి. ఎక్కడా పచ్చి గడ్డి దొరికే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రాయచోటి, ప్రొద్దుటూరు, పెండ్లిమర్రి, నందిమండలం ప్రాంతాల నుంచి ట్రాక్టర్ గడ్డిని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. పశుగ్రాసం కొరతతో ఏడాదికి 7, 8 నెలలు పాలిచ్చే గేదెలు కూడా నాలుగు ఐదు నెలలకే ఒట్టిపోతున్నాయని పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామీణ ప్రాంతాలలో పశువులను గుట్టల వైపు తీసుకెళ్తున్నా.. అక్కడ పచ్చి గడ్డి లేక పాలు కూడా సరిగా ఇవ్వడం లేదని పశుపోషకులు వాపోతున్నారు. రెండు పూటలా కాస్త గడ్డి వేస్తేనే పాలు ఇస్తున్నాయని వారు అంటున్నారు. గొర్రెలు, పశువుల పెంపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉచితంగా పశుగ్రాసం, దాణా సరఫరా చేయాలని కోరుతున్నారు. వైశాఖ మాసం వచ్చిందంటే చాలు పశుగ్రాసంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు చాలా వరకు పశుగ్రాసం కొరతతో కబేళాకు తరలిస్తున్నట్లు పశుపోషకులు అంటున్నారు.

పశువులను పోషించాలంటే భారంగా ఉంది



ప్రస్తుత వేసవి కాలంలో పశువులను పోషించాలంటే చాలా భారంగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని కొనుగోలు చేస్తున్నాం. ట్రాక్టర్ ఎండు గడ్డి రూ.15 వేల నుంచి రూ.20 వేలు పలుకుతోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయి. కొండలు, గుట్టలలో ఎక్కడ చూసినా పచ్చి గడ్డి కనిపించడం లేదు. దీంతో పశువులకు పశుగ్రాసం కరువైంది. ప్రభుత్వం స్పందించి పశుగ్రాసం, దాణా సరఫరా చేయాలి.

– కృష్ణారెడ్డి, పశు పోషకుడు, పులివెందుల

డబ్బులు ఖర్చు చేసినా దొరకని పశుగ్రాసం



పశుగ్రాసం, దాణా కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసినా దొరకడం లేదు. దీంతో పశువులను పోషించాలంటే చాలా కష్టంగా మారింది. ఎన్నడూ లేని విధంగా ఎండలు ఈ ఏడాది ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల ఎక్కడా పచ్చి గడ్డి దొరకడం లేదు. గడ్డి లేకపోవడం వల్ల గేదెలు పాలు కూడా తక్కువగా ఇస్తున్నాయి. చేసేదేమిలేక గడ్డి ట్రాక్టర్ రూ.20 వేలతో కొనుగోలు చేసి పశువులను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– చంద్ర, రైతు, పులివెందుల

వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ అనుకూలం

- ఈ విషయం రాష్ట్ర ముస్లింలందరికీ తెలుసు
- బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

పులివెందుల టౌన్ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ పూర్తి అనుకూలమని, ఇది రాష్ట్ర ముస్లింలందరికీ తెలిసిన విషయమేనని, ఈ విషయాన్ని బీటెక్ రవి గుర్తు పెట్టుకోవాలని నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్ రాజారెడ్డి భవన్‌లో ముస్లిం నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీటెక్ రవి ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు కల్పించి రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లుకు సీఎం చంద్రబాబు మద్దతు ఇవ్వడం దారుణమైన విషయమని, అయినా కూడా తెలుగుదేశం శ్రేణులు ఈ విషయాన్ని బహిరంగంగా ఒప్పుకొంటూ అదేదో గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. సాక్షాత్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ బిల్లుకు మద్దతిచ్చిన చంద్రబాబును దుర్మార్గుడిగా అభివర్ణించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకుంటే బిల్లు పాస్ అయ్యేది కాదని మమతా బెనర్జీ పేర్కొన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ముస్లింలకు అనుకూలంగా.. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వాజ్యం వేయడం నిజం కాదా అన్నారు. దీనికి పులివెందుల వైఎస్సార్‌సీపీ ముస్లిం శ్రేణులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపడంతో మీకెందుకు ఈర్ష్య అని పేర్కొన్నారు. పులివెందుల ముస్లింలకు తమ సొంత నిధులు ఇచ్చి ఈద్గా మైదానం ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ కుటుంబానిది అని, పులివెందులలోని మసీదులకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాడా నిధులు ఇప్పించి అభివృద్ధి చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పులివెందులలో ఉన్న పేద ముస్లిం పిల్లల కోసం అరబిక్ కాలేజ్ (మదరస) కోసం ఏడు ఎకరాల భూమి వారి సొంత నిధులతో కేటాయించడం తెలిసిన విషయమేనన్నారు. కరోనా సమయంలో టీడీపీ నాయకులు ఇంటికి పరిమితమైతే, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి క్వారంటైన్ ఏర్పాటు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, వైద్య సదుపాయాలు కల్పించడం వాస్తవం కాదా అని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకుడి గురించి మాట్లాడడం భావ్యం కాదని, ఆ కుటుంబానికి ఏమి చేసింది, ఎంత వరకు ఆయన కుటుంబాన్ని ఆదరించిందో ఇస్మాయిల్ కుటుంబ సభ్యులను అడిగితే తెలుస్తుందన్నారు. ఆయన అంతిమ సంస్కారానికి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజల సేవయే తమ ధ్యేయంగా ప్రభుత్వ అధికారులు రూల్స్ ప్రకారం ఒప్పుకోకపోయినా ప్రజాదర్బార్‌లో పాల్గొంటే.. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, అప్పటి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు ఆరోగ్యం క్షీణించిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా కూడా బంగారు అంగడి అబ్దుల్ గఫూర్, ఇస్మాయిల్‌లు కరోనా వైరస్ వల్ల మరణించారని తెలిసి క్యాంపు నుంచి రాగానే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి.. అధికారులు ఆంక్షలు విధించినా బేఖాతర్ చేస్తూ కార్యకర్తలే నా ప్రాణమంటూ ఇంటికి వచ్చి పరామర్శించారన్నారు. అటువంటి ఉత్తమమైన మనిషి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత బీటెక్ రవికి లేదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాదర్ బాషా, సోషల్ మీడియా ప్రతినిధులు జహీర్, అరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామంలో ఆలయంలో నిర్మించి శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట పూర్తయి ఏడాదైన సందర్భంగా వేద పండితులు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణతోపాటు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతర స్వామివారి కల్యాణను కనుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాల మధ్య కల్యాణం చేశారు. మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి తిలకించారు. అనంతరం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

వర్గీకరణ కోసం దశాబ్దాల పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జమ్మలమడుగు రూరల్ : ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ దశాబ్దాల పోరాటం సాగించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బొంతల నాగరాజు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన నేపథ్యంలో సోమవారం వేపరాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలు నిర్వహించే పోరాటానికి ప్రతీ ఒక్కరు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నిర్వహించే పోరాటానికి అడ్డుపడే స్వార్థపరుల కుట్రలను మాదిగ జాతి తిప్పికొట్టిందని పేర్కొన్నారు. వర్గీకరణకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఓబులేసు, శంకర్, చంద్ర, నాగన్న, కార్తీక్, మురళి, చిన్నయ్య పాల్గొన్నారు.

పూడిపోయిన డ్రైనేజీ కాలువలు

వేంపల్లె : వేంపల్లెలో పారిశుద్ధ్యం పనులు అస్తవ్యస్తంగా మారడంతో డ్రైనేజీ కాలువలు చెత్తా చెదారాలతో పూడిపోయాయి. గత కొన్ని నెలలుగా వేంపల్లెలోని శ్రీ చైతన్య పాఠశాల ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు చెత్తతో నిండిపోవడం జరిగింది. డ్రైనేజీ కాలువలు చెత్తతో నిండిపోవడంతో మురికి నీరు కాలువల్లో పారడం లేదు. పంచాయతీకి కార్యదర్శి లేకపోవడంతో పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, వాటర్ స్కీమ్ సిబ్బందికి, ఇతర పనులు చేసే సిబ్బందికి దాదాపు 5 నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు. దీంతో పనులు చేసేందుకు సిబ్బంది నిరాకరిస్తుండడంతో పారిశుద్ధ్య పనులు ఆయా ప్రాంతాల్లో సరిగా జరగడం లేదు. పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు తెలిపారు. వార్డు మెంబర్ల మాట కూడా సిబ్బంది వద్ద విలువ లేకుండా పోయిందని వాపోయారు. ఎన్నోసార్లు శ్రీ చైతన్య పాఠశాల ప్రాంతంలో ఉన్న డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలని, పారిశుద్ధ్య సిబ్బందిని కోరినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పంచాయతీకి కార్యదర్శి లేనప్పుడు ఎంపీడీఓ గాని, ఈఓపీఆర్డీ గాని బాధ్యతలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ వారు కూడా పట్టించుకోవడం లేదని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు తెలిపారు. సమస్యలు ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లితే ఒక్కరికి ఒక్కరూ బాధ్యతలను వేసుకోకుండా విస్మరిస్తున్నారన్నారు. ఇన్‌చార్జ్ అధికారి కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికారులైనా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలి



సింహాద్రిపురం : ఆదర్శ రైతులను సన్మానిస్తున్న వ్యవసాయ అధికారులు



కమలాపురం : సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

సింహాద్రిపురం : రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింహాద్రిపురం మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం జరుగుతోందని, పశువుల ఎరువు, పచ్చి రొట్ట ఎరువులు, సుగర్‌కేన్ మొలసిస్, వానపాముల ఎరువుల, వర్మీ కంపోస్ట్, పీఎండీఎస్ నవధాన్యాల సాగుతో 365 రోజులు పంటలు సాగు చేయాలన్నారు. న్యూట్రి గార్డెన్స్, ఘన, ద్రవ జీవామృతం తయారీ, వినియోగం, వివిధ రకాల కషాయాలు, ద్రావణాల గురించి వివరించారు. బహుళ ప్రయోజనాలైన పశు సంపద, కోళ్ల పెంపకాలను రైతులు మళ్లీ చేపట్టాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ రైతులు పైడిపాలెం వెంకటనాయుడు, కసనూరు సాంబశివారెడ్డి, సింహాద్రిపురం అరవిందనాథరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం మంజునాథ, వెలుగు సీసీలు, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సమాఖ్య సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ నాగసుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

కమలాపురం : ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, చదిపిరాళ్ల, కోగటం పంచాయతీలకు చెందిన అగ్రికల్చర్, ఏపీసీఎన్ఎఫ్, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్, డ్వాక్రా సంఘ సభ్యులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రకృతి వ్యవసాయ సాగును పెంచాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్‌కు సహకరిస్తామన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, దీనిని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంపై శిక్షణ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్ర పీఓ రవితేజ

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో సోమవారం సుస్థిర వ్యవసాయ కేంద్రం, సేట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పెంపకం, ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతుల గురించి వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సేట్రీస్ సంస్థ ప్రతినిధి హరుణ్ హాజరై మొక్కల ఎంపిక, నాటే విధానం, కొమ్మ కత్తిరింపుల గురించి వివరించారు. అనంతరం సుస్థిర వ్యవసాయ కేంద్రం పీఓ రవితేజ పండ్ల తోటల యాజమాన్యంలో పురుగు, తెగుళ్ల నివారణకు, మొక్కల పెరుగుదలకు పాటించాల్సిన సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, మొక్కలలో వేరుకుల్లు నివారణకు ట్రైకోడెర్మా, సుడోమొనాస్ కల్చర్ వాడడం, ఆకుముడత దోమ నివారణకు వేప నూనె, కానుగ నూనె స్ప్రే చేయడం, పిండినల్లికి తుమ్మకాయల కషాయం, గంజి, ఇంగువ ద్రావణం స్ప్రే చేయాలని ప్రొజెక్టర్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విద్యా సాగర్, భాస్కర్, శివార్జునరెడ్డి, అశోక్, ప్రత్యూష, జ్యోతి, భవాని పాల్గొన్నారు.

నూతన వేరుశనగ రకాలతో ఉపయోగం



క్షేత్ర దినోత్సవం నిర్వహణలో పాల్గొన్న అధికారులు, రైతులు

చింతకొమ్మదిన్నె : ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా డీబీటీ–బయోటెక్ కిసాన్ పథకంలో భాగంగా సోమవారం చింతకొమ్మదిన్నె మండలంలోని ఇప్పపెంట గ్రామంలోని పూజారి సుబ్బయ్య అనే రైతు పొలంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఏ.వీరయ్య మాట్లాడుతూ రైతులకు ఇప్పపెంట, వేంపల్లి, సిద్దవటం గ్రామాలలో వేరుశనగ టి.సి.జి.ఎస్ 1694 (వశిష్ట) రకమును దాదాపు పది ఎకరాలకు పంపిణీ చేయడం జరిగిందని, టి.సి.జి. ఎస్.1694 అనే వేరుశనగ రకం తెగుళ్లను తట్టుకొనే శక్తి కలిగి అన్ని కాలాలకు అనువైన రకమని, పంట వేసిన 110 రోజులలో పంట చేతికి వస్తుందని ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. దానికోసం విత్తన శుద్ధి చేయవలెనని, తద్వారా వేరుశనగ పంట తొలి దశలో వచ్చే వేరు కుళ్ళు తెగుళ్ల రసం పీల్చే పురుగుల నుంచి మొక్కలను కాపాడవచ్చు అని తెలిపారు. అలాగే వైరస్ తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడానికి పొలం చుట్టూ నాలుగు సాళ్లతో జొన్న, సజ్జల రక్షణ పంటలను, అలాగే తెల్ల దోమ, తామర పురుగుల నివారణకు ఎకరాకు 20 చొప్పున పసుపు రంగు, నీలిరంగు జిగురు అట్టలను వాడుకోవాలని పేర్కొన్నారు. రసాయన పురుగు మందులు విచక్షణారహితంగా వాడకుండా ఆర్థిక సహన పరిమితిని అనుసరించి వాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ జి. ప్రభాకరరెడ్డి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె.అంకయ్య కుమార్, కెవికె శాస్త్రవేత్తలు టి.మహేష్ బాబు, వి.శిల్పకళ, ఐ.సురేష్ కుమార్ రెడ్డి, డిబిటి ప్రాజెక్టు యువ నిపుణులు ఆర్.గిరీష్‌కుమార్, ఇప్పపెంట గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ వి.రేఖ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. రోగులకు ఇక్కట్లు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది రోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో రోగులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. కోట్ల రూపాయలు వెచ్చించి ఆసుపత్రి నిర్మిస్తే వైద్య సిబ్బంది కొరతతో సరైన వైద్య సేవలు అందడం లేదని రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న అరకొర వైద్య సిబ్బంది కూడా సరైన వైద్య సేవలు అందించడం లేదని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వైద్య సేవల కోసం రోగులు గంటల తరబడి వేచి ఉంటే ఉన్న డ్యూటీలో ఉన్న వైద్యుడు సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తుండటం గమనార్హం. కట్టు కట్టడానికి గంటకు పైగా వేచి ఉన్నప్పటికి కనీసం సిబ్బంది ఆ పక్కకు కూడా తొంగి చూడలేదని రోగులు బండయ్య, గంగాధర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రోజు ముందే ఎమ్మెల్యే చైతన్యరెడ్డి వైద్య సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. వారి పనితీరులో ఏ మాత్రం మార్పు రాలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను భర్తీ చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం పై డ్యూటీ డాక్టర్‌ను వివరణ కోరగా కట్లు కట్టే సిబ్బంది ఈ రోజు డ్యూటీకి రాలేదని, దీంతో వారికి కొంత మేరకు ఇబ్బంది కలిగిన మాట వాస్తవేనన్నారు.

ఒరిజినల్ 1బీలు రాక రైతులకు ఇక్కట్లు

– జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి

చక్రాయపేట : మండలంలో ఒరిజినల్ 1బీలు రాకపోవడంతో బ్యాంకు రుణాల రెన్యువల్ సందర్భంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో తెల్ల పేపర్‌పైన ఇస్తున్న 1బీలతో బ్యాంకు అధికారులు రుణాలు రెన్యువల్ చేస్తున్నారు కానీ, ఉన్న మొత్తం కంటే మరింత లోను పెంచుకోవాలంటే బ్యాంకు అధికారులు ఒరిజినల్ 1బీలు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఒరిజినల్ 1బీలు ఉంటే అర్హత మేరకు రుణాన్ని పెంచి ఇస్తారని, ఇవి రానందున రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటే.. అప్పులు చేసి ట్యాంకర్లతో నీరు తోలుకుంటూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. ఈ సమయంలోనే రుణాల రెన్యువల్ కూడా ఉండటంతో అటు బ్యాంకులకు వడ్డీల మొత్తం సరిపడక, ఇటు పంటలు కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రైతులకు ఒరిజినల్ 1బీలు ఇచ్చేలా చూడాలని, లేదంటే తెల్ల కాగితంపై వచ్చే 1బీలపై రుణం మొత్తం పెంచి ఇచ్చేలా బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

మట్టి నమూనాల సేకరణ

కమలాపురం : కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో పంటలు సాగు చేసే రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని జంభాపురం గ్రామంలో ఆయన మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025–26 సీజన్‌కు సంబంధించి డివిజన్ పరిధిలోని కమలాపురంలో 990 మట్టి నమూనాలు, వల్లూరు మండలానికి 528, వీరపునాయునిపల్లెకు 924, ఎర్రగుంట్లకు 858 మట్టి నమూనాలను సేకరించాలని ఉన్నతాధికారులు లక్ష్యం విధించారన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.